**కథ**

'చాందీ జైసీ రంగ్ హై తేరా
సోనే జైసే బాల్..తుమ్ హీ ధన్‌వాన్ హై గోరీ
బాకీ సబ్ కంగాల్'

ఎమ్.టి.విలో వస్తున్న ఆ పాట జోరుకీ, ఆ అబ్బాయి కళ్లల్లో కైపుకీ పరవశించిపోతున్న ప్రియకి ఫోన్ మోగుతున్న ధ్వని ఒకంతట వినిపించలేదు. వినిపించాకా కార్డ్‌లెస్ తీసి చెంపకి ఆన్చుకుని మత్తుగా ''హలో'' అంది.

# పారిపోదాం...రా!

అవతల వైపునుండి ''ప్చ్..ప్చ్..ప్చ్..'' అన్న శబ్దం మాత్రం వినిపించింది.

ప్రియ చిన్నగా నవ్వుకుని అదే పద్ధతిలో రిప్లై ఇచ్చింది.

''ఈరోజు కాలేజ్‌కి ఎందుకు రాలేదూ... ఐ మిస్ యూ... ఇప్పుడు టైం ఎంతో కాలేదు. ఒకసారి వచ్చి చూసెళ్లనా?'' అడిగాడు రాహుల్.

''చాల్లే. టీవీలో మిడ్‌నైట్ మసాలా కూడా అయిపోయింది. ఇప్పుడా? మమ్మీ డాడీ నిద్ర లేస్తేనో?'' కంగారుగా అంది ప్రియ.

''జస్ట్. ఫిఫ్టీన్ మినిట్స్‌లో నా బుల్లెట్ మీద మీ గేట్ ముందుంటాను. పది నిమిషాలు చాలు.. లేకపోతే నాకీ రాత్రి నిద్ర రాదు. నిన్ను చూడకపోతే నేను బ్రతకలేను ప్రియా!'' అతని గొంతులో ఆర్తికి ఆమె కరిగిపోయింది.

''నాకు భయంగా వుంది రాహుల్!'' అంది. సంసిద్ధత వ్యక్తం చేస్తూనే.

''భయం వుంటేనే థ్రిల్ వుంటుంది... వస్తున్నా!'' రాహుల్ ఫోన్ పెట్టేశాడు.

★ ★ ★

ప్రియ టెన్షన్‌గా అతని కోసం ప్రహారీ గోడ పక్కన నిలబడి వెయిట్ చేస్తోంది. మధ్య మధ్యలో. ఇంట్లో లైట్లు వెలుగుతాయేమో! మమ్మీ డాడీ నిద్ర లేస్తారేమోనని ఇంటివైపు చూస్తూనే వుంది. మనసులో రేపు కాలేజ్‌లో రాహుల్ చేసిన ఈ చర్య గురించి గర్వంగా స్నేహితురాళ్లకి చెప్పుకుని వాళ్ల కళ్లల్లో ఈర్ష్య చూడాలనే వుంది.

రాహుల్ అన్నట్లుగానే బుల్లెట్ మీద దూసుకొచ్చాడు.

ఆమె శబ్దం చెయ్యొద్దన్నట్లు నోటిమీద వేలేసుకుని చూపించి ఇంటి వెనక వైపునున్న సురక్షిత స్థానానికి తీసుకెళ్లింది.

రాహుల్ వెన్నెల్లో గ్రీకువీరుడిలా మెరిసిపోతున్నాడు. పాలూ, మీగడలతో తయ్యారుచేసినట్లు రాజుగ్గా ముట్టుకుంటే మాసిపోయేట్లు వుంటాడు. కోటీశ్వరుల ఒక్కగానొక్క ముద్దుబిడ్డ. వాళ్ల నాన్నగారికి నగల వ్యాపారం.

ప్రియకి ముగ్గురు అక్కలు. ఇంకా పెద్దక్కకి పెళ్లి సంబంధాలు కూడా చూడడం లేదు. కారణం ఆ అమ్మాయి మెడిసిన్ రెండవ సంవత్సరంలో వుంది. ఈ లెక్కన ఇద్దరక్కలకీ పెళ్లిళ్లయి లైన్ క్లియర్ అయ్యేసరికీ ఇంకో ఏడేళ్లు ఈజీగా పడ్తుందని ప్రియకి భయంగా వుంటుంది. కనీసం ఇద్దరక్కలకీ బాయ్‌ఫ్రెండ్స్ కూడా వున్న దాఖలాలు లేవు!

ప్రియ చామనఛాయ అయినా... వయసు పదిహేడే అయినా ఏపుగా ఎదిగి ఆకర్షణీయంగా వుంటుంది.

రాహుల్ ఆమెని మొదటిసారి వాలీబాల్ ఆడుతుంటే చూసాడు.

చూడగానే ''వావ్... యూ ఆర్ బ్యూటిఫుల్!'' అన్నాడు.

ప్రియ కోపంగా చూడబోయి నవ్వేసింది. ఆ తర్వాత అతడన్నమాట క్లాసులో అందరితో పదే పదే చెప్పుకుంది.

ఒక వారం గడిచేలోగానే ఇద్దరూ చిత్రంగా సినిమాలు చూసారు. బయటికొచ్చేసరికి తమకీ పెళ్లీ సంసారం, సంతానం పొందే వయసు వచ్చేసిందని అర్థం చేసుకున్నారు. పార్కులకీ, పార్లర్లకీ జోరుగా తిరిగారు. ఫస్ట్ ఇయర్ చెరి రెండు సబ్జెక్ట్‌లలో తప్పారు.

''ఉద్యోగం చెయ్యకపోతే పొట్ట నిండనివాళ్లకే ఈ చదువులు'' అన్నాడు రాహుల్.

''ఔను'' అంది అతని నుండి వచ్చే 'సెంట్' పరిమళం ఆస్వాదిస్తూ బుల్లెట్ మీద వెనకాల ఎక్కి అతని నడుం చుట్టూ చేతులు వేస్తూ ప్రియ.

ఆరోజు వాళ్లు ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో పార్టీ చేసుకున్నారు.

''మనం అన్నింట్లో ఏకాభిప్రాయం కలిగి వున్నాం... చదువు విషయంలో కూడా! అందుకే ఈ సెలబ్రేషన్'' అన్నాడు.

ఆమె అతని కళ్లల్లోకి చూస్తూ కరిగిపోయింది.

సెకెండ్ ఇయర్‌లోకి వచ్చారు కులాసాగా క్లాసులు ఎగ్గొట్టి 'కుషీ'గా ఓ సినిమాకెళ్లొచ్చారు.

''మీ మమ్మీ డెలివరీ, మా మమ్మీ డెలివరీ ఒకే హాస్పిటల్లో అయ్యుంటుంది... బహుశా మనకు స్నానాలు చేయించేటప్పుడే నేను నీ ప్రేమలో పడిపోయి వుంటాను'' అన్నాడు నవ్వుతూ రాహుల్.

''అయ్యుంటుంది రాహుల్... ఈ ప్రేమ అప్పుడు మొగ్గ తొడిగినదే... ఇప్పుడు వికసిస్తోంది'' అంది పారవశ్యంగా ప్రియ.

పూర్తిగా వికసించిన వారి ప్రేమ ఇద్దరూ ఇంటర్ మీడియెట్ ఫెయిలయ్యేట్లు చేసింది.

పెద్దవాళ్లు ఇద్దర్నీ ఇంట్లో కూర్చోపెట్టారు. బయట అడుగు పెట్టడానికి వీల్లేదన్నారు.

ప్రియ ఏడ్చి ఏడ్చి మూడు కేజీల బరువు తగ్గిపోయింది.

రాహుల్ ఆమెకి తమని ఎవరూ వేరుచెయ్యలేరని ధైర్యం చెప్పాడు.

ఇంటర్ పాసయిందనిపించిన ప్రియని ఒక విమెన్స్ కాలేజీలో డిగ్రీలో చేర్పించారు పెద్దవాళ్లు.

రాహుల్ మాత్రం పాసవలేదు. ప్రియ కాలేజీ చుట్టూ చక్కర్లు కొట్టడానికే అతని సమయం అంతా ఖర్చయిపోతోంది.

ఈరోజు ప్రియకి కాస్త జ్వరం వచ్చి కాలేజ్‌కి వెళ్లలేదు. అది తట్టుకోలేని రాహుల్ ఇలా పన్నెండున్నరకి చీకట్లో వచ్చి ఆమె ఒళ్లో వాలాడు.

ప్రియ అతనికి తను రహస్యంగా తెచ్చిన ఫిజ్ బర్గర్ నోటికి అందించింది.

''దీనికోసమా ఇంత రిస్క్ చేసి వచ్చింది?'' అన్నాడు నిష్ఠూరంగా.

ప్రియ నవ్వి ముందుకి ఒంగి పెదవులు అందించింది.

పది నిమిషాల తర్వాత రాహుల్ సీరియస్‌గా చెప్పాడు.

''ప్రియా... ఇలా కష్టం... మనం వెంటనే పెళ్లి చేసుకోవాలి...''

ప్రియ గాభరాగా ''ఇంట్లో ఒప్పు
కోరు'' అంది.

రాహుల్ చిరాగ్గా ''ఇంట్లో చెప్పి
చేసుకుంటామా మనం? ఎప్పుడో బీసీ
నాటి మాటలు చెప్తావూ...'' అన్నాడు.

''మరి!'' అంది.

''పారిపోదాం పద!'' ఆమె చెయ్యి
పట్టుకుంటూ అన్నాడు.

★ ★ ★

''నాకు చలేస్తోంది...'' స్లీవ్‌లెస్ టీ
షర్ట్‌లో వణికిపోతూ అంది ప్రియ.

''నేను పక్కనుండగానే!' ఆమెని
దగ్గరికి తీసుకుంటూ రొమాంటిగ్గా
అన్నాడు రాహుల్.

''ఆకలేస్తోంది!'' గోముగా అతని
చెవిలో అంది.

''నువ్వు బిస్కట్స్ తిను.. నేను
నిన్ను తింటాను'' ఆమె చెవిని ముని
పంటితో కొరుకుతూ అన్నాడు.

ప్రియ బిస్కట్స్ తింటూ అతని
చిలిపి చేష్టలకి పులకరించిపోయింది.

''పెద్దవాళ్ల భయం లేదు.. ఇద్దరమే
ఇక్కడ... ఎంతో హాయిగా లేదూ!''
అన్నాడు రాహుల్.

ప్రియ అతని ఒడిలో పడుకుని ''ఐ
లవ్ యూ రాహుల్'' అంది.

ట్రైన్ బ్రిడ్జి మీదనుండి వెళ్తోందను
కుంటా. ధనా...ధనా చప్పుడు
వస్తోంది.

ఆ శబ్దంలో వాళ్ల చిలిపి సంభాషణ
కలిసిపోయింది.

''మనం చెన్నైలో ఏదో ఒక గుడిలో
పెళ్లి చేసుకుందాం'' అన్నాడు రాహుల్.

నిద్ర ముంచుకువస్తుండగా ''ఊ''
అంది ప్రియ. ఆ తర్వాత డ్రీమ్స్‌లోకె
ళ్లారు.



★ ★ ★

వర్షం ఆగకుండా కురుస్తూనే వుంది.

''రాహుల్... నాకు చలేస్తోంది...!' అంది
ప్రియ..

''నీకు మాత్రమేనా? క... ద్దంలా... నేనూ
తడిసిపోయాను'' అన్నాడు చిరాగ్గా రాహుల్.

''అన్నం తిని రెండు రోజులయింది...
నాకు ఆకలేస్తోంది... బ్రెడ్డో, బిస్కట్లో
కాదు... అన్నమే కావాలి!' అంది కన్నీళ్లతో
ప్రియ.

''ఈ పూట బ్రెడ్డుకీ బిస్కట్లకీ కూడా
డబ్బులు లేవు'' విసుగ్గా అన్నాడు రాహుల్.

ప్రియకి డైనింగ్ టేబుల్ ముందు అమ్మ అమర్చే
వంటకాలూ, తను తిననంటే ఆమె బతిమాలి
నోట్లో పెట్టడం గుర్తొచ్చాయి.

'అ...మ్మా...'' అని ఏడ్చింది.

''ఆపు. ఎప్పుడూ ఏడుపు మొహం
నువ్వూ'' ఆయాసపడ్తూ ఆగి అన్నాడు
రాహుల్.

అతనికి ''ఆమ్లెట్ వెయ్యమన్నారా బాబూ!
ఇడ్లీలోకి వెన్నపూస వేసుకోండి చిన్నబాబూ!''
అనే పనివాళ్లు గుర్తొచ్చారు.

'ఇంక నేను నడవలేను... అయినా ఎక్కడికి
నడవాలి?'' అడిగింది కోపంగా ప్రియ.

రాహుల్ మొహంలో ఒక స్థిర నిశ్చయం కని
పించింది. ''ఆ ఇంట్లోకి వెళ్దాం'' అన్నాడు.

''ఎందుకూ?'' అంది.

''ఏదైనా పెట్టమని సిగ్గువిడిచి అడుగుదాం.
తప్పిపోయామనో... ఏదో చెప్పేద్దాం...''
అన్నాడు.

ఆమె నీరసంగా తల వూపి ఆ పెద్ద గేటు
తీసుకుని అతని వెంట నడిచింది.

రాహుల్ భయంగా కుక్కలు వస్తాయేమోనని
అటూ ఇటూ చూస్తూ నడిచాడు.

''స్టే దేర్... హూ ఆర్ యూ!'' అన్న గ్ర...
లాంటి బొంగురు గొంతు వినిపించింది.

ప్రియ కాళ్లు గడగడా వణికాయి.

రాహుల్‌కి కూడా సన్నటి వణుకు కలిగింది.
పుట్టాకా ఎవరికీ భయపడని అతను త...

బలభద్రపాత్రుని రమణి

దొంగల్లా చూస్తున్న ఆ పెద్దాయనకి భయపడ్తూ నిలబడ్డాడు.

★ ★ ★

ప్రహ్లాద... మేజర్ ప్రహ్లాద పైప్ తాగుతూ రాహుల్ చెప్పేది మొత్తం విన్నాడు.

ప్రియ కాళ్లల్లో శక్తి నశించి అందే చతికిలపడి పోయింది.

''సో... ఇద్దరూ ఇంట్లోంచి లేచిపోయొచ్చేసారా?'' అడిగాడు తెలుగులో.

ఇద్దరూ తలలు వంచుకున్నారు.

''వెరీగుడ్... మీ గట్స్‌ని మెచ్చుకుంటున్నాను. అబ్బాయి నీ పేరేమిటి? రాహుల్ అన్నావు కదూ... వెళ్లు... వెళ్లి మన ముగ్గురికీ టీ పెట్టడానికి పాల ప్యాకెట్లూ, ఆమ్లెట్స్ వెయ్యడానికి ఎగ్స్ పట్రా... పో!'' అన్నాడు.

రాహుల్ తల వూపాడు. కానీ కదలలేదు.

''ఏం... నిలబడ్డావు?'' అడిగాడాయన.

''నాదగ్గర... నాదగ్గర... డబ్బులు లేవు'' తల వంచుకుంటూ అన్నాడు రాహుల్. ఇలాంటి పరిస్థితి ఒకటి వస్తుందని కాలేజ్‌లో వందలకి వందలు ఖర్చు పెట్టేటప్పుడు ఎప్పుడూ అనిపించలేదు రాహుల్‌కి.

ప్రహ్లాద ప్రియ వైపు చూసాడు.

''వంటింట్లో ఉప్మారవ్వ వుంది... వెళ్లి ఐదు నిమిషాల్లో ఉప్మా చెయ్యి... కమాన్ హరీ అప్...'' అని అరిచాడు.

ఆమె కాళ్లు తడబడ్తుండగా రెండు అడుగులు వేసి వెనక్కి తిరిగింది.

''ఏవిటీ?'' అడిగాడు ప్రహ్లాద.

''ఉప్మారవ్వ ఎలా వుంటుందో నాకు తెలీదు. ఎప్పుడూ కిచెన్‌లోకి వెళ్లలేదు'' భయపడ్తూనే చెప్పింది.

''వాట్?'' ఆయన కళ్లు పెద్దవి చేసి దిక్కులు పిక్కటిల్లేటట్లుగ అన్నట్లు అరిచాడు.

రాహుల్ కూడా ఆ అరుపుకి భయపడ్డాడు.


ప్రహ్లాద గబగబా వచ్చి ఇద్దర్ని రెండు చేతుల్తో పట్టుకుని డోర్ వైపు తోస్తూ అన్నాడు 'గెట్ అవుట్... పొండిరా... సోంబేరుల్లారా! మీకు నా ఇంట్లోనే కాదు... ఈ ప్రపంచంలోనే స్థానం లేదు.''

రాహుల్ ఏడుస్తూ ''అంకుల్... ప్లీజ్. ఈ రాత్రికి వుండనీయండి... బయట చాలా వర్షంగా వుంది... ప్లీజ్!'' అని బతిమాలాడు.

ప్రియ ఏడుస్తూ క్రింద పడి పోయింది.

ప్రహ్లాద ఇద్దర్నీ సీరియస్‌గా చూశాడు. ''ఒరేయ్... టీ పెట్టడానికి పాలు కొనలేని నువ్వూ... ఉప్మా చెయ్యడానికి ఏం రవ్వ వాడాలో తెలీని ఈ పిల్లా... ఏం చేద్దామని ఇంట్లోంచి పారిపోయి వచ్చేసారా?'' అన్నాడు.

ప్రియకి సోష వస్తోంది. కళ్లు మూసేసుకుంది. ''అమ్మానాన్నలు కోరినవన్నీ ఇచ్చి కడుపునిండా తిండీ, జేబునిండా ఖర్చులకీ ఇస్తుంటే జీవితం సినిమాల్లో చూపించినట్లు రంగురంగుల కలలా వుంటుందనుకున్నారా? కాదు... జీవితం చేదుగా వుంటుంది... పో... రిక్షా తొక్కండి... కూలిపని చెయ్యండి... అనుక్కోండి... పొండి'' అని అరిచాడు.



వాట్ నెక్స్ట్!
చింపూ కపూర్, శరత్‌కుమార్, గంగూలీ... వాట్ నెక్స్ట్? అని నగ్మా అంతరంగంలో ఆలోచిస్తున్నట్టుంది.
-విశ్రుత

''అంకుల్... ఒక్కపూటకి ఇంత అన్నం పెట్టండి... రేపు ఏదైనా పని చేసుకుంటాం'' అన్నాడు కళ్లు మోచేత్తో తుడుచుకుంటూ రాహుల్.

''సరే... ఈ పూటకి అన్నం తిని... రేపు ఉదయమే గార్డెన్‌లో చెట్లు కత్తిరించి, లాన్ స్వీప్ చేసి... బట్టలన్నీ ఉతికి ఇస్త్రీ చేసి వెళ్లండి'' అని ''అన్నపూర్ణా... వీళ్లిద్దరికీ కాస్త అన్నం పెట్టి మజ్జిగ పొయ్యి'' అన్నాడు.

అన్నపూర్ణమ్మ పెట్టిన అన్నం ప్లేట్లో చూస్తుంటే దాని విలువేమిటో తెలిసినట్లయింది వాళ్లకి. ఆవిడ వడ్డించిన కూరతో, పులుసుతో ఆవురావురుమని తిన్నారు.

★ ★ ★

ప్రియ, రాహుల్ హాల్లో కార్పెట్ మీద పడి ఆదమరిచి నిద్రపోయాకా అడిగింది అన్నపూర్ణమ్మ... ''ఎవరండీ ఆ పిల్లలూ?''

''ఇంకా రెక్కలు రాకుండానే ఎగరాలని ప్రయత్నించి క్రింద పడిపోతున్న పక్షులు... ఇరవై ఏళ్లక్రితం ఇలాంటి ఉద్రేకంలోనే ఇల్లు విడిచి వెళ్లిన మన అమ్మాయి ఆ అమ్మాయిలో కనిపించడం లేదూ...'' అడిగాడు.

''ఔను... అది...'' ఆవిడ కన్నీళ్లు పెట్టుకుంది.

''బ్రతకలేక... పోయారిద్దరూ... అలా కాకుండా వుండాలనే వీళ్లని ఇక్కడ ఈ రాత్రికి ఆపాను'' అన్నాడు ప్రహ్లాద.

''ఆ తల్లిదండ్రులు ఎంత ఏడుస్తున్నారో పాపం!'' అంది కళ్లు తుడుచుకుంటూ అన్నపూర్ణమ్మ.

''తప్పు వాళ్లదీ కాదు... వీళ్లదీ కాదు... జీవితం అంటే ఓ అమ్మాయీ అబ్బాయీ కలిసి గెంతులెయ్యడం... పెళ్లి చేసుకుని పిల్లల్ని కనడం అని నమ్మిస్తున్న మీడియాది! చాలా ప్రభావపూరితమైన మీడియాది... ఆ పెళ్లికి కావల్సిన అర్హతలేమిటో తెలిసే వయసూ ఊహూ... అపురూపంగా అరచేతుల్లో పెరిగిన ఈ పసి కూనలకి ఎలా తెలుస్తుందీ?''

ప్రహ్లాద ఫోన్ చేతుల్లోకి తీసుకుని ఆరోజు న్యూస్ పేపర్‌లో పడ్డ ప్రియా, రాహుల్ ఫోటోలనోసారి చూసి క్రిందనున్న నెంబర్లు మనసులో అనుకుంటూ డయల్ చెయ్యసాగాడు. ★